సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం । 26 । ఏప్రిల్ । 2024



వైఎస్సార్ సీపీలోకి వలసలు
సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడే కొద్దీ.. వైఎస్సార్‌సీపీలోకి చేరికలు జోరుగా సాగుతున్నాయి. ప్రధానంగా టీడీపీ నుంచి భారీగా వస్తున్నారు.

-IIలో



రేపు పాలిసెట్ ప్రవేశ పరీక్ష
జిల్లావ్యాప్తంగా పాలిసెట్-2024 ప్రవేశ పరీక్ష ఈనెల 27న జరగనుంది.ఇందు కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

-IIలో

గరిష్టం/కనిష్టం
42.6/26.8

వాతావరణం
జిల్లాలో గురువారం 26.8 - 42.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

ఉరకలెత్తిన ఉత్సాహం

- పులివెందులలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నామినేషన్‌కు వేలాదిగా తరలివచ్చిన అభిమానులు
- వైఎస్సార్‌సీపీ సైన్యంలో సమరోత్సాహం
- పులివెందుల కీర్తి ప్రతిష్టలను ఎలుగెత్తి చాటిన సీఎం వైఎస్ జగన్
- తరతమ భేదం, బంధుప్రీతికి ఆస్కారం లేకుండా సుపరిపాలన అందించామని స్పష్టీకరణ
- ఆకట్టుకున్న ముఖ్యమంత్రి ప్రసంగం
- నెలరోజుల్లోపే రెండోసారి పులివెందులలో భారీ బహిరంగ సభ



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం



వేదికపై నుంచి పిడికిలి పిగించి ప్రజలను ఉత్తేజపరుస్తున్న వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, కడప: పులివెందుల పట్టణం జనసంద్రమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగ్‌మోహన్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా మండుటెండను సైతం లెక్కచేయకుండా వివిధ మండలాల నుంచి వేలాది మంది పార్టీ శ్రేణుల్లో అభిమానం ఉప్పొంగింది. ఉత్సాహం ఉరకలెత్తింది. పులివెందుల వైఎస్సార్‌సీపీ సైన్యం ఎన్నికల యుద్ధానికి సిద్ధమైంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహం నింపారు. పులివెందుల కీర్తి ప్రతిష్టలను ఎలుగెత్తి చాటారు. స్థానిక పరిస్థితులతో పాటు ప్రత్యర్థి పార్టీలు పన్నుతున్న కుట్రలు తదితర అంశాలను ఆయన కూలంకషంగా వివరించారు. ఒక వర్గం పథకం ప్రకారం చేస్తున్న దుష్ప్రచారానికి దీటుగా జవాబు చెప్పారు. తర తమ భేదం లేకుండా విపక్షతకు, బంధుప్రీతికి ఆస్కారం లేకుండా పాలన అందిస్తున్న నేపథ్యాన్ని వివరిస్తూనే జరుగుతున్న కుట్రలను పటాపంచలు చేశారు. పులివెందుల అసెంబ్లీ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన చేసిన ప్రసంగం ఒక్క పులివెందుల వాసులనే కాదు యావత్ ఆంధ్రదేశాన్ని ఆలోచింపజేసేలా సాగింది. ఇంతకాలం పులివెందుల పంచాయితీ, రాజారెడ్డి రాజ్యాంగం అటూ టీడీపీ అధినేత చంద్రబాబు, ఎల్లోమీడియా దుష్ప్రచారం చేస్తూ వచ్చాయి. ఎక్కడ ఎలాంటి చిన్న ఘటన తెరపైకి వచ్చినా పులివెందుల సంస్కృతి (కల్చర్)అంటూ ఆరోపణలు సంధిస్తూ వచ్చారు. విపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న ఆరోపణలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దీటుగా, ఘాటుగా జవాబు చెప్పారు. పులివెందుల అంటే నమ్మకం.. పులివెందుల అంటే ధైర్యం.. పులివెందుల అంటే అభివృద్ధి, పులివెందుల అంటే ఓ విజయగాథ.. పులివెందులలో ఒకప్పుడు ఏముందని అడిగితే, ఇప్పుడు ఏమి లేదో చెప్పండి అనే స్థాయికి వచ్చామని సీఎం వైఎస్ జగన్ వివరిస్తుంటే ప్రజానీకం ఈలలు, కేకలతో ఆనందం వ్యక్తం చేశారు. మంచి చేయడం మన కల్చర్, మంచి మనస్సు మన కల్చర్, మాట తప్పకపోవడం మన కల్చర్, బెదిరింపులకు లొంగకపోవడం మన కల్చర్ అని తెలిపారు. పులివెందులను తెలుగుసీమ అభిమానించింది, నమ్మింది, కలిసి నడిచింది. ఇలా రాష్ట్రంలో ప్రతి గ్రామంలోనూ మన పులివెందుల, మన కడప, మన రాయలసీమ మంచితనం.. మాటపై నిలబడే గుండె ధైర్యాన్ని ఆయన సవివరంగా చెబుతూ ఉంటే సభికులు పులివెందుల ముద్దుబిడ్డ అంటూ నినాదాలతో హోరెత్తించారు.

కుట్రలు, కుయుక్తులు పటాపంచల్

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలన గురించి చెబుతూ పేదలకు మంచి చేయాలని, ఇచ్చిన మాట ప్రకారం రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని ప్రజలు తనకు అధికారం అప్పగించారని బంధుప్రీతి కోసం కాదంటూ తేల్చి చెప్పారు. కుట్రలు, కుయుక్తులతో ప్రత్యర్థులతో చేతులు కలిపిన బంధువులకు సైతం చురకలంటించారు. మా చిన్నాన్న వివేకానందరెడ్డి హత్యలో వాస్తవికతకు దూరంగా అభాండాలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు., నేనే హంతకుడిని అని చెబుతున్న వ్యక్తికి అండగా నిలుస్తున్న పరిస్థితి, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడించిన వారితోనే కలిసికట్టుగా తిరుగుతున్నారు అంటూ విమర్శనాస్త్రాలు సంధించారు. మా కంటే చాలా చిన్నోడైన వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రశ్నలకు బదులిచ్చే పరిస్థితి కూడా లేదని చెప్పుకొచ్చారు. అవినాష్‌రెడ్డి ఎలాంటి తప్పు చేయలేదు కాబట్టే ఎంపీ టికెట్ ఇచ్చానని స్పష్టం చేశారు. పదే పదే వైఎస్ అవినాష్‌రెడ్డిపై పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, డాక్టర్ నర్రెడ్డి సునీత చేస్తున్న ఆరోపణలకు ఫుల్‌స్టాప్ పెట్టారు.

నెలలోపు రెండు సార్లు పర్యటన...

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం కార్యక్రమాన్ని ఇడుపులపాయ నుంచి మార్చి 27న ప్రారంభించారు. ఎన్నికల శంఖారావాన్ని పూరించిన ఆయన తొలి అడుగు పులివెందుల నుంచే పడింది. ఏప్రిల్ 25న నామినేషన్ కార్యక్రమానికి మరోమారు పులివెందులకు వచ్చారు. నెలలోపు రెండుసార్లు నియోజకవర్గంలో పర్యటించడం శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపింది. వైఎస్ జగన్ నామినేషన్ కార్యక్రమానికి భారీ ఎత్తున ప్రజానీకం హాజరయ్యారు. నిప్పుల కొలిమి లాగా ఎండవేడిమి ఉన్నా, కాళ్లు కదపకుండా.. కళ్లు ఆర్పకుండా అలాగే నిలబడి వైఎస్ జగన్ ప్రసంగం ఆసాంతం ప్రజలు ఆసక్తిగా ఆలకించడం విశేషం. ఈ ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయం రాష్ట్రంలో ఓ సంచలనం కావాలని పులివెందుల వాసులు అంటున్నారు.. వైఎస్ జగన్ ప్రసంగం అందరినీ ఆకట్టుకునేలా.. ఆలోచింపజేసేలా సాగిందనడంలో సందేహం లేదు.



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తూ..



ముఖ్యమంత్రికి హారతి ఇస్తున్న మహిళలు



వృద్ధురాలికి భరోసా ఇస్తూ..



జగన్‌మామయ్యపై ప్రేమతో చిన్నారులు..

న్యూస్‌రీల్

పీహెచ్‌సీ తనిఖీ
లింగాల: లింగాల పీహెచ్‌సీని గురువారం జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో జరుగుతున్న వైద్య సేవలు, ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ పట్ల ఆయన తగు సూచనలు చేశారు. జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మొయినుద్దీన్, జిల్లా గణాంక అధికారి రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫీజుకు గడువు పెంపు
కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించేందుకు ఈనెల 30వ తేదీ వరకు గడువు పెంచినట్లు ఇంటర్ ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. అలాగే రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు కూడా ఈనెల 30వ తేదీలోపు ఫీజు చెల్లించాలని ఆయన సూచించారు.

1 నుంచి క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంపు
కడప స్పోర్ట్స్: క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) ఆధ్వర్యంలో మేనెల 1 నుంచి క్రికెట్ వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు సీఏవైడీ కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. కడప నగరం, ప్రొద్దు టూరు, నందలూరు, బ్రహ్మంగారిమఠం సబ్ సెంటర్లలో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కడప సబ్ సెంటర్ వివరాలు అన్వర్‌బాషా 9618883665, నందలూరు ఫిరోజ్‌ఖాన్ లోడీ 6302699747, ప్రొద్దుటూరు బి.సుదర్శన్ 807445 2053, బి. మఠం ఎం.బాలగురివిరెడ్డి 9347862325 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ ఫలితాలు విడుదల
కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకు నిర్వహించిన పది, ఇంటర్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. ఇందులో పదవ తరగతి పరీక్షలకు సంబంధించి జిల్లాలో 13 పరీక్షా కేంద్రాలలో 2280 మంది పరీక్షలు రాయగా వారిలో 1679 మంది పాసై 73.38 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే ఇంటర్ పరీక్షలకు సంబంధించి 28 పరీక్షా కేంద్రాలలో 6981 మంది పరీక్షలు రాయగా వారిలో 5815 మంది పాసై 80.92 శాతం ఉత్తీర్ణత పొందారు. ఇందుకు సంబంధించి పరీక్షా ఫలితాలను www.apopenschool.ap.gon.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. ఓపెన్ పది, ఇంటర్ ఫలితాల పట్ల ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి, డీఈఓ మర్రెడ్డి అనురాధ హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

- చివరిరోజు వెల్లువెత్తిన నామినేషన్లు
- కడప లోక్‌సభ స్థానానికి 47
- ఏడు అసెంబ్లీ స్థానాలకు 317
- నేటి నుంచి నామినేషన్ల పరిశీలన

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టం పూర్తయింది. ఈ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ గడువు గురువారంతో ముగిసింది. వైఎస్సార్ జిల్లాలో 7 అసెంబ్లీ స్థానాలు, కడప లోక్‌సభ స్థానానికి పోటీచేసే అభ్యర్థులు తమ నామినేషన్లను సంబంధిత రిటర్నింగ్ అధికారులకు సమర్పించారు. ఈనెల 18న ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ 25వ తేదీన గురువారం మధ్యాహ్నం 3 గంటలతో పూర్తయింది. శుక్రవారం నామినేషన్లను పరిశీలించనున్నారు. ఈనెల 29వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. మే 13వ తేదీన ఒక విడతలో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుండగా జూన్ 4వ తేదీన ఫలితాలు వెలువడనున్నాయి. ఈసారి ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు భారీ సంఖ్యలో ముందుకు వచ్చారు. అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాలకు నామినేషన్ల వెల్లువ కనిపించింది. జిల్లాలోని కడప లోక్‌సభ స్థానానికి 47 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు 317 నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ పూర్తయ్యాక బరిలో నిలిచేది ఎంతమందో తేలనుంది. ఆ తరువాత అభ్యర్థుల తుది జాబితాను ఎన్నికల అధికారులు ప్రకటించనున్నారు. మే 11వ తేదీన సాయంత్రం ఎన్నికల ప్రచారానికి తెరపడనుంది.



మూడవ సెట్ నామినేషన్ దాఖలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

ప్రశాంతంగా...

నామినేషన్ల దాఖలు పర్వం ప్రశాంతంగా ముగిసింది. నామినేషన్లు దాఖలు చేసేందుకు గురువారం చివరిరోజు కావడంతో భారీగా నామినేషన్లు సమర్పించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులే కాకుండా ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా ఈసారి ఎన్నికల్లో భారీగా నామినేషన్లు దాఖలు చేశారు.

నామినేషన్ల దాఖలు వివరాలు ఇలా..	
కడప లోక్‌సభ స్థానానికి: 47	పులివెందుల: 53
	కడప: 59
	కమలాపురం: 35
	జమ్మలమడుగు: 46
అసెంబ్లీ స్థానాలకు: 317	ప్రొద్దుటూరు: 45
	మైదుకూరు: 41
	బద్వేలు: 38

‘తహలిల్’తో ముగిసిన కమలాపురం ఉరుసు

కమలాపురం: పట్టణంలో వెలసిన శ్రీ హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి, హజరత్ దస్తగిరి షా ఖాద్రి, హజరత్ మౌలానా మౌల్వీ ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి, హజరత్ జహీరుద్దీన్ షా ఖాద్రి ఉరుసు ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ నెల 22వ తేదీ నుంచి దర్గా పీఠాధిపతి (ముతవల్లి) సజ్జాద్-ఏ-నషీన్ మహమ్మద్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో, దర్గా కన్వీనర్ షేక్ ఇస్మాయిల్ పర్యవేక్షణలో జరుగుతున్న ఉత్సవాలు గురువారం తహలిల్ కార్యక్రమంతో ముగిశాయి. ఉదయం స్థానిక పాత బస్టాండు సమీపంలోని గంధం ఇంటి నుంచి పీఠాధిపతి ఆధ్వర్యంలో పూలచాదర్ తదితర వాటిని ప్రత్యేకంగా అలంకరించిన చాందినిలో ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చారు. ఊరేగింపులో అశేష భక్త జన సందోహం నడుమ పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చుతూ డప్పు వాయిద్యాల మధ్య యువత వివిధ రకాల నత్యాలు చేశారు. ఊరేగింపు దర్గా చేరిన అనంతరం దర్గాలో వెలసి ఉన్న స్వాముల వారి మజార్లపై పూల చాదర్‌లు సమర్పించి ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం నషాన్ రోజున దర్గా ఆవరణంలో ఆవిష్కరించిన జెండాను తొలగించారు. దీంతో ఉరుసు మహోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు దస్తగిరి షా ఖాద్రి, మౌలానా ఖాద్రి, గౌస్ పాక్, జియా, ఇస్మాయిల్, సర్ఫరాజ్, పెద్ద సంఖ్యలో భక్తులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు. కాగా భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.



ఊరేగింపులో పాల్గొన్న పీఠాధిపతి, సోదరులు, భక్తులు

ఉరుసు ఉత్సవాల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే



దర్గాలో ప్రత్యేక ఫాతెహా నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్ బాషా, ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం: కమలాపురంలో జరుగుతున్న హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి ఉరుసు ఉత్సవాల్లో డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్ బాషా, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు. బుధవారం అర్ధరాత్రి విచ్చేసిన వీరికి పీఠాధిపతి హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి, దర్గా కన్వీనర్ ఇస్మాయిల్‌ల ఆధ్వర్యంలో దర్గా మర్యాదలతో స్వాగతం పలికారు. దర్గాను దర్శించుకున్న వారు స్వామి వారి మజార్ల పై పూలచాదర్లు సమర్పించి ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి వద్ద ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా వారిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

చక్రస్నాన వీక్షణం.. సర్వపాప హరణం



పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



పుష్కరిణిలో చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

పుష్కరిణిలో భక్తుల పుణ్యస్నానాలు

ఒంటిమిట్ట: ఏకశిలానగరి కోదండరాముడి బ్రహ్మోత్సవాలు తొమ్మిది రోజులు వైభవంగా జరిగాయి. వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల ముగింపు దశలో కీలకమైన చక్రస్నానాన్ని గురువారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ జరిపారు. సీతారామలక్ష్మణ దివ్యమూర్తులను పట్టు వస్త్రాలు, ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. 9 గంటలకు సుదర్శన చక్రత్తాళ్వారును పల్లకీలో ఆలయం ఎదురుగా నిర్మించి నూతన పుష్కరిణికి తీసుకువచ్చారు. 9.30 గంటల నుంచి 10.15 గంటల వరకు సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులకు ఉత్సవ కంకణదారు రాజేష్ ఆధ్వర్యంలో స్నపనతిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. 10.30 గంటల నుంచి 11.15 గంటల వరకు అర్చకులు వేదమంత్రోచ్చారణలతో చక్రస్నాన కార్యక్రమాన్ని జరిపారు. టీటీడీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, కళాకారులు, భక్తులు పుణ్యస్నానాలు చేశారు. పుష్కరిణి నుంచి ఆలయ మాఢ వీధులలో ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. స్వామివారు ముంగిట్లోకి రావడంతో భక్తులు కాయాకర్పూరం సమర్పించారు. హారతులు అందుకున్నారు. గురువారం రాత్రి అర్చకులు ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ పరిశీలన

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాకు నియమించిన సాధారణ, వ్యయ, పోలీసు పరిశీలకులు గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌ను పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి పర్యవేక్షణ నిమిత్తం బుధవారం సాయంత్రం జిల్లాకు చేరుకున్న సాధారణ పరిశీలకులు కునాల్ సిల్కు, భానుదాస్ పాలవెలు జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ రామరాజు, జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌లతో కలిసి గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌ను పరిశీలించారు. కంట్రోల్ రూమ్‌లోని అన్ని విభాగాల సిబ్బంది నిర్వహిస్తున్న విధులను వారు పరిశీలించారు. వారితో పాటు వ్యయ పరిశీలకులు రమేష్ భారతి కే.ఎస్, సత్యేంద్ర సింగ్ మెహరా, రాజేష్ కుమార్ మీనాలతో పాటు.. పోలీస్ పరిశీలకులు అర్జీత్ సేన్ ఠాకూర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా ఎన్నికల కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జి, కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్ ఎంసీసీ, ఎంసీఎంసీ, ఎలక్ట్రానిక్ మీడియా మానిటరింగ్ సెల్, వ్యయ మానిటరింగ్ సెల్, సీజర్స్, సువిధ, గ్రీవెన్స్- రిడ్రెసల్ సెల్ విభాగాల సిబ్బంది విధులను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పరిశీలకులకు వివరించారు.



జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు

618 ఫిర్యాదులకు పరిష్కారం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై మొత్తం 625 ఫిర్యాదులు అందగా 618 ఫిర్యాదులకు పరిష్కారం అందించామని జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వేర్వేరు ఫిర్యాదు వేదికల ద్వారా అందిన ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ ఫిర్యాదుల పరిష్కార నివేదికను విడుదల చేశామన్నారు. వచ్చిన ఫిర్యాదుల్లో ఏడు విచారణ దశలో ఉన్నాయన్నారు.

- సి.విజిల్ ద్వారా మొత్తం 387 కేసులు నమోదు కాగా అందులో 243 నిజనిర్ధారణ కాగా, 144 నిరాధారమైనవిగా గుర్తించామన్నారు.
- ఎఫ్ఎస్‌టీ..ఎస్ఎస్‌టీ.. పోలీసు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్ ద్వారా చేపట్టిన సీజర్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ ద్వారా కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.3,77,04,185 ల మేర నగదు, రూ.7,64,80,940 ల విలువైన లిక్కర్, ఇతర వస్తువులను సీజ్ చేశామన్నారు. అలాగే 1,106 ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేశామని వివరించారు.

క్లుప్తంగా

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ


సోమా తేజశ్రీనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : జేఈఈ జేఈఈ మెయిన్స్–2024 ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఈ ఫలితాలల్లో పెండ్లిమర్రి మండలం కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన సోమా తేజ శ్రీనాథ్‌రెడ్డి ప్రతిభ కనబరిచాడు. 98 శాతంతో ఆలిండియాలో 16000 ర్యాంకు సాధించాడు. ఇతను విజయవాడ చైతన్య కళాశాలలో ఇంటర్ చదివాడు. జేఈఈలో ఉత్తమ ఫలితం సాధించిన తేజశ్రీనాథ్‌రెడ్డిని తల్లిదండ్రులు సోమా శ్రీనివాసులురెడ్డి, చైతన్యలు అభినందించారు.

అరటి తోట దగ్ధం


కాలిపోయిన అరటితోట

చింతకొమ్మదిన్నె : మండలంలోని నాగిరెడ్డిపల్లెలో అరటితోట దగ్ధమైంది. నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన గుత్తిరెడ్డి శివారెడ్డి దాదాపు నాలుగు ఎకరాల్లో అరటి తోటను సాగు చేశారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అరటి తోట మొత్తం కాలిపోయింది, దాదాపు రూ. 8 లక్షల వరకు నష్టం వాటిలినట్లు బాధిత రైతు వాపోతున్నాడు.

అస్వస్థతతో ఉపాధి కూలి మృతి


పెద్ద బాలుడు మృతదేహం

మైదుకూరు : ఉపాధి పనులకు వెళ్లిన ఓ వృద్ధుడు ఎండలకు అస్వస్థతకు గురై పనిచేస్తున్న చోటే మృతి చెందిన సంఘటన మైదుకూరు మండలం గంజికుంట పంచాయతీ లెక్కలవారిపల్లెలో గురువారం జరిగింది. లెక్కలవారిపల్లెకు చెందిన గవ్వల పెద్ద బాలుడు(62) గురువారం ఉపాధి పనులకు వెళ్లాడు. పనిచేస్తూ ఒక్క సారిగా కుప్పకూలి పడిపోయి మృతి చెందాడు. గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఉపాధి ఏపీఓ రామచంద్రారెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. సంఘటన గురించి ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు ఏపీఓ తెలిపారు.

జీపు, బైక్ ఢీకొని..

చక్రాయపేట : మండలంలోని నాగలగుట్టపల్లె సమీపంలో ఉన్న దశరథ మహారాజు ఆలయం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్ద మావిరెడ్డిగారి భాస్కర్ రెడ్డి(40) అనే వ్యక్తి మృతి చెందాడు.మృతుడు మండలంలోని చిలేకాంపల్లె గ్రామ వాసి. భాస్కర్ రెడ్డి బైక్‌లో వెళుతుండగా జీపు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని 108 వాహనంలో వేంపల్లెకు తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భాస్కర్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో చనిపోయిన విషయం తమ దృష్టికి వచ్చిందని, ఇంకా ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఎస్సై వినోద్‌కుమార్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి కొనసాగుతున్న వలసలు

సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడే కొద్దీ.. వైఎస్సార్‌సీపీలోకి చేరికలు జోరుగా సాగుతున్నాయి. ప్రధానంగా టీడీపీ నుంచి భారీగా వస్తున్నారు. తాజాగా గురువారం జిల్లాలో వైఎస్సార్ సీపీలో పలు కుటుంబాలు చేరాయి.


వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడపలో 50 కుటుంబాలు

కడప కార్పొరేషన్ : కడపలోని 39వ డివిజన్ మోచంపేటలో తెలుగుదేశం పార్టీ నుంచి 50 కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో వారికి ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన జగనన్నను అందరూ ఆశీర్వదించి, మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో ఇస్మాయిల్, ఖాదర్ భాష ఇస్మాయిల్ ,చాన్ భాష ,రషీద్ భాష, అన్సర్, హుస్సేన్ సాబ్, రియాజ్,సిరాజ్ రియాజ్ యూనివర్సల్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమం లో 39వ డివిజన్ ఇన్‌చార్జి కమల్ భాష, వైఎస్సార్‌సీపీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, మాస్టర్ అహ్మద్,సలీం సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : పట్టణంలోని ఎస్పీజీ క్వార్టర్స్‌లో 70 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంచాల పుష్పరాజ్, మరో70 కుటుంబాల వారు పార్టీలో చేరారు.వీరికి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సింగరయ్య, డాక్టర్ ఆగస్టీన్ రాజు, బడిగించల చంద్రమౌళి, హృషి కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరులో..

మైదుకూరు : మైదుకూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం రాత్రి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సమక్షంలో ఖాజీపేట మండలం నాగసానిపల్లెకు చెందిన 150 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. నాగసానిపల్లెకు చెందిన ఓ పది కుటుంబాల వారు రెండు రోజుల కిందట వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరారు. గురువారం వారితోపాటు 140 కుటుంబాల వారు ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఏపీఐఐసీ డైరెక్టర్ డి.గంగాధర్‌రెడ్డి, నాగసానిపల్లె సర్పంచ్ నక్కా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో పెరుగు శ్రీకాంత్, దాసరి పవన్‌కుమార్, కేశవ, ఎం.శ్రీనివాస నాయక్, రాంజా నాయక్ (భూండాలు), పవన్ కుమార్ నాయక్, బాబు నాయక్, సుబ్బరాజు, పుల్లూరు నడిపెన్న, శ్రీకాంత్, లాలమ్మ, హనుమమ్మ, పెద్దమ్మ, శంకరమ్మ, బాబమ్మ దేవి, కాంతమ్మ తదతరులకు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పార్టీ కండువాలను వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావాలని అన్నారు. కార్యక్రమంలో నాగేశ్వర రెడ్డి, పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

రేపు పాలిసెట్ ప్రవేశ పరీక్ష

హాజరుకానున్న 7840 మంది విద్యార్థులు


కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా పాలిసెట్–2024 ప్రవేశ పరీక్ష ఈనెల 27న జరగనుంది.ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కడపలో 09, పొద్దుటూరులో 07 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో మొత్తం 7840 మంది విద్యార్థులు పరీక్షలను రాయనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు.తాగునీరు సిద్ధం చేయడంతో పాటు వడదెబ్బను ఎదుర్కోవడానికి కావాల్సిన మందులు అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు.

కడపలో పరీక్ష కేంద్రాలు, విద్యార్థుల వివరాలు..
కడపలోని ఆర్ట్స్ కళాశాల పరీక్ష కేంద్రంలో 480 మంది, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ మహిళా కళాశాలలో 480 మంది, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 300 మంది, గవర్నమెంట్ మున్సిపల్ హైస్కూల్ మొయిన్‌లో 240 మంది, శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో 300 మంది, శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో 597 మంది, నాగార్జున డిగ్రీ కళాశాలలో 459 మంది, గురుకుల విద్యాపీఠ్ హైస్కూల్‌లో 300 మంది, శ్రీహరి డిగ్రీ కళాశాలలో 300మంది విద్యార్థులు పాలిసెట్ ప్రవేశ పరీక్షను రాయనున్నారు.

పొద్దుటూరులో..
పొద్దుటూరులోని వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో 750 మంది, ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల(కామిశెట్టి కాలేజ్)లో 600 మంది, వైవీఎస్ మున్సిపల్ హైస్కూల్‌లో 400 మంది, అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో 200 మంది, లేపాక్షి డిగ్రీ కళాశాలలో 240 మంది, లింగాపురంలోని సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో 1057 మంది, చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో 1148 మంది విద్యార్థులు పాలిసెట్ ప్రవేశ పరీక్షను రాయనున్నారు.

ముందుగా చేరుకోవాలి



విద్యార్థులు పరీక్ష సమయానికంటే గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి. ఉదయం 10 గంటలకే లోపలికి అనుమతిస్తాం. 11 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుంది. 11 గంటల తర్వాత వచ్చిన వారిని పరీక్ష కేంద్రంలోకి అనుమతించం. విద్యార్థుల తప్పకుండా హాల్‌టికెట్ వెంట తెచ్చుకోవాలి. ఆధార్ కార్డు కూడా తెచ్చుకోవాలి.ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రంలోకి తీసుకురాకూడదు.

– సీహెచ్. జ్యోతి,
జిల్లా పాలిసెట్ కోఆర్డినేటర్, కడప

ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

కడప రూరల్ : ఎన్నికల విధులకు హాజరయ్యే ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని ఏపీ ఎన్జీఓ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఇక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగులకు ఏ నియోజక వర్గంలో ఓటు ఉన్నా పనిచేస్తున్న నియోజకవర్గ ఫెసిలిటేషన్ సెంటర్ ఓటు వేసుకోవడానికి అవకాశం ఉందన్నారు ఇందుకు సంబంధించి ఫారం 12ను జత చేయడానికి ఈ నెల 26వ తేదీ ఆఖరి రోజని అన్నారు. ఈ అంశానికి సంబంధించి ఏవైనా ఇబ్బందులు ఉంటే ఎన్జీఓ అసోషియేషన్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. ఉద్యోగులు తప్పనిసరిగా 100 శాతం పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై ప్రసాద్‌యాదవ్, జిల్లా కార్యదర్శి డీ రవికుమార్, సహ అధ్యక్షుడు తిమ్మారెడ్డి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే మలేరియాకు అడ్డుకట్ట


మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్

కడప రూరల్ : పరిశుభ్రతా చర్యలతో మలేరియాకు అడ్డుకట్ట వేయవచ్చని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ ఏ ఉమామహేశ్వరకుమార్ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన జాగ్రత్తలు తీసుకుంటే మలేరియా తీవ్రతరం కాకుండా.. ప్రాణాపాయం లేకుండా చూసుకోవచ్చని అన్నారు. నీటి నిల్వ ప్రాంతాలు లేకుండా చూడడం, పరిసరాల పరిశుభ్రత పాటించడం, దోమలు కుట్టకుండా దోమతెరలు వాడడం తదితర జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రధానంగా దోమలు వృద్ధి చెందకుడా, లార్వా దశలోనే ఫ్రై డే డ్రై డే కార్యక్రమాలను చేపట్టడం ద్వారా దోమలను నివారించవచ్చని వివరించారు. కలిసికట్టుగా మలేరియా నిర్మూలనకు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎల్‌ఏటీఓ డాక్టర్ రవిబాబు, డాక్టర్ సునీత, హెచ్ వెంకటచంద్రారెడ్డి, డివిజనల్ పంచాయతీ అధికారి మస్తాన్‌వలి, జిల్లా మలేరియా అధికారి పీ మనోరమ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై వివరాలు తెలపాలి

కడప సెవెన్‌రోడ్స్ : ఓటర్లను మభ్యపెట్టే చర్యలతో పాటు ఎన్నికల కమిషన్ నిబంధనలను ఉల్లంఘించే అంశాలను వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు కునాల్ సిల్కు, భానుదాస్ పాలవె గురువారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణ నిమిత్తం వారు బుధవారం జిల్లాకు చేరుకున్నారు. 2011–ఐఏఎస్ బ్యాచ్ కు చెందిన కునాల్ సిల్కు (సెల్ : 9818140243) కడప, పార్లమెంటరీ, కడప, పులివెందుల, కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గాలకు, అలాగే 2013 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన భానుదాస్ పాలవె (సెల్ : 7350266713) బద్వేల్, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు నియోజకవర్గాలకు జనరల్ పరిశీలకులుగా జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా వారు జిల్లా ఓటర్లకు కొన్ని సూచనలు ఇచ్చారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే చర్యలపై సమాచారం అందినా, నగదు, బంగారం, మద్యం తదితర ఓటర్లను మభ్యపెట్టే వస్తువుల పంపిణీ జరిగినా, అక్రమంగా రవాణా జరిగినా, మరే ఇతర ఎన్నికల నిబంధనల ఉల్లంఘన జరిగినా... వెంటనే తమ సెల్ నెంబర్లకు కాల్ చేసి గానీ, వాట్సాప్ ద్వారా గానీ ఫిర్యాదు చేయవచ్చని వారు పేర్కొన్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

గుంతకల్లు డీఆర్‌ఎం వినీత్‌సింగ్


ప్లాట్‌ఫాం వద్ద పనులను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం వినీత్‌సింగ్, ఇతర అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వేస్టేషన్‌లో రూ. 25 కోట్లతో అమృత్ భారత్ పథకం కింద చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టడంతోపాటు సకాలంలో పూర్తి చేయాలని గుంతకల్లు రైల్వే డీఆర్‌ఎం వినీత్‌సింగ్ పేర్కొన్నారు. గురువారం ఆయన కడప రైల్వేస్టేషన్‌లోని రెండవ ప్లాట్‌ఫాంలో జరుగుతున్న షెల్టర్, ప్లాట్‌ఫాం విస్తరణ, పార్కింగ్ పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. తర్వాత పార్శిల్ సర్వీసును కూడా తనిఖీ చేసి నెలకు ఏ మేర ఆదాయం వస్తుందని అడిగి తెలుసుకున్నారు. సీనియర్ డీఈఎన్ అక్కిరెడ్డి, సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీఓఎం శ్రావణ్‌కుమార్, సీనియర్ డీఈ వీరయ్య, చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ బీఆర్ కృష్ణ, కడప రైల్వేస్టేషన్ మేనేజర్ శేఖర్ కుమార్, సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, ఏడీఈఎన్ రాధాకృష్ణ, ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు దాటుతుండగా రైలు ఢీ : వ్యక్తి మృతి

ఎర్రగుంట్ల : రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదుశాత్తు ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని గొల్ల శ్రీనివాసులు(31) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం ఎర్రగుంట్లలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. పెద్దముడియం మండలం చిన్నపసువుల గ్రామానికి చెందిన గొల్ల శ్రీనివాసులు భార్య తులసి పిల్లలతో పుట్టిల్లు విజయనగరం వెళ్లింది.వీరిని పిలుచుకురావడానికి శ్రీనివాసులు వెళ్లారు. విజయనగరం నుంచి బయలుదేరిన వాళ్లు నంద్యాలలో దిగారు. అక్కడ నుంచి ధర్మవరం రైలు ఎక్కి జమ్మలమడుగులో దిగాల్సి ఉండగా మరిచి పోయి ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో దిగారు. అక్కడినుంచి ప్రొద్దుటూరు వెళ్లడానికి బస్సు ఎక్కేందుకు రైలు పట్టాలు దాటుతుండగా ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో గొల్ల శ్రీనివాసులు అక్కడికి అక్కడే మృతి చెందాడు. కళ్ల ముందే భర్త చనిపోవడం చూసి భార్య తులసి కన్నీరుమున్నీరుగా విలపించింది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అక్రమ మద్యంపై కొరడా!

– కడప ఎస్‌ఈబీ పరిధిలో 213 కేసులు, 174 మంది అరెస్ట్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : అక్రమ మద్యం రవాణాపై ఎస్‌ఈబీ అధికారులు కొరఢా ఝళిపించారు. కడప స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) స్టేషన్ పరిధిలోని కడప, చింతకొమ్మదిన్నె, పెండ్లిమర్రి, చెన్నూరు. ఖాజీపేట మండలాల్లో 2024 జనవరి నుంచి ఏప్రిల్ 24 వరకు మొత్తం 213 కేసులు నమోదు చేసి 174 మందిని అరెస్టు చేశారు. ఏపీ మద్యం అక్రమ తరలింపునకు సంబంధించి మొత్తం 152 కేసులు నమోదు చేసి 154 మందిని అరెస్ట్ చేశారు. 963 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 7 వాహనాలను సీజ్ చేశారు. ఇతర రాష్ట్రాల మద్యం అమ్మకాలు సాగిస్తుండగా మొత్తం 13 కేసులు నమోదు చేసి 19 మందిని అరెస్ట్ చేశారు. 338 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని 5 వాహనాలను సీజ్ చేశారు. నాటుసారా తయారీలో మొత్తం 48 కేసులు నమోదు చేసి ఒకరిని అరెస్ట్ చేశారు.అదేవిధంగా 130 లీటర్ల సారా పట్టుకుని ఒక వాహనాన్ని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

జీవనోపాధికి వెళ్లి విగతజీవులైన యువకులు

– మృతులు రామసముద్రం వాసులు


సుబ్రహ్మణ్యం శశి కుమార్ లోకేష్

బనశంకరి, రామసముద్రం: బెంగళూరు నగరంలో ఉన్న కృష్ణరాజపురం పరిధిలో బైయ్యప్పనహళ్ళి రైల్వే స్టేషన్ వద్ద రైలు ఢీకొని ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు. మృతులు ఆంధ్రప్రదేశ్‌లోని రామసముద్రం మండలం కనగాని గ్రామానికి చెందిన అమరనారాయణ కుమారుడు శశికుమార్ (25), ఎలవానెల్లూరు పంచాయతీ గజ్జిగంగనపల్లెకు చెందిన రామన్న కుమారుడు సుబ్రహ్మణ్యం (24), రాగిమాకులపల్లి పంచాయతీ పేడరాజుపల్లెకు చెందిన భాస్కర్ కుమారుడు లోకేష్ (25)లుగా గుర్తించినట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. వీరందరూ పాతికేళ్ల వయసువారే. ఉపాధి కోసం ఇటీవల బెంగళూరుకు వచ్చినట్లు తెలుస్తోంది. బుధవారం రాత్రి 8.30 సమయంలో రైల్వే ట్రాక్ మీద మొబైల్‌ఫోన్‌లో హెడ్‌ఫోన్ పెట్టుకుని వీడియోలు చూస్తున్నారు. పోలీసులు రావడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు. కొంతసేపటికి తిరిగి వచ్చి అలాగే కూర్చున్నారు. ఇంతలో వేగంగా బెంగళూరు– కణ్ణూరు ఎక్స్‌ప్రెస్ రైలు దూసుకొచ్చింది. వారిని ఢీకొనడంతో పక్కనే ఉన్న కాలువలోకి పడిపోయారు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు.

వివాహిత అనుమానాస్పద మృతి


మృతురాలు లతిక (ఫైల్)

కడప అర్బన్ : అగ్నిసాక్షిగా ప్రమాణం చేసి.. తాళికట్టిన భర్తే, భార్య పాలిట కాలయముడయ్యాడు. వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని, ఎంత చెప్పినా వినకుండా, తన భార్యను చిత్ర హింసలకు గురిచేసి ఆమె నిండు నూరేళ్ల జీవితాన్ని బలితీసుకున్నాడు. ఈ సంఘటన కడప నగరంలోని రిమ్స్ పిఎస్ పరిధిలో సాగర్‌కాలనీలో గురువారం చోటుచేసుకుంది. మృతురాలి తండ్రి లక్ష్మినారాయణ ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా పత్తికొండ గ్రామానికి చెందిన వడ్డే లక్ష్మినారాయణ ట్రాక్టర్ తోలుతూ జీవనం సాగిస్తున్నాడు. లక్ష్మినారాయణ, నాగలక్ష్మిలకు ఇద్దరు కుమార్తెలు లావణ్య, లతిక అలియాస్ లత (22), కుమారుడు మణికంఠ సంతానం. రెండో కుమార్తె లతికను కడపలోని సాగర్‌కాలనీకి చెందిన వడ్డే లింగన్న, పద్మ అలియాస్ శాంతిల పెద్ద కుమారుడు సాయికుమార్‌కు ఇచ్చి మూడేళ్ల క్రితం వివాహం చేశారు. వివాహ సమయంలో కట్నకానుకల కింద ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ. 3.50 లక్షల నగదును ఇచ్చారు. ఏడాది కిందట వీరికి కుమారుడు పుట్టి నాలుగు రోజులకే చనిపోయాడు. ప్రస్తుతం లతిక మూడు నెలల గర్భిణి. కాగా సాయికుమార్ ఒంటిమిట్ట సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో సాయికుమార్‌తో పాటు సచివాలయంలో రాచగుడిపల్లె ఫిషరీస్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈనెల 24వ తేదీన సదరు మహిళ, సాయికుమార్ సెల్‌ఫోన్‌కు ఫోన్ చేయగా, ఆ ఫోన్‌ను లతిక లిఫ్ట్ చేసి, తన మామ లింగన్నకు ఇచ్చింది. ఈ క్రమంలో లింగన్న, తన కుమారుడు సాయికుమార్‌ను మందలించాడు. ఇటీవల పెద్దల సమక్షంలో ఇద్దరికి కౌన్సెలింగ్ ఇచ్చారు. సంసారం చక్కదిద్దుకోవాలని నచ్చచెప్పారు. గురువారం ఉదయం 8 గంటలకు సాయికుమార్ తండ్రి లింగన్న, లతిక తండ్రి లక్ష్మినారాయణకు ఫోన్ చేసి, మీ కుమార్తె ఇంటిలో ఉరేసుకుందని సమాచారం ఇచ్చాడు. హుటాహుటిన లక్ష్మినారాయణ, తన కుటుంబసభ్యులు, బంధువులతో వచ్చారు. లతికను కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.అప్పటికే ఆమె చనిపోయిందని డాక్టర్లు చెప్పారని తెలియజేశారు. సాయంత్రం కడప రిమ్స్ పోలీస్‌స్టేషన్‌లో మృతురాలి తండ్రి లక్ష్మినారాయణ ఫిర్యాదు చేశారు.

తన కుమార్తెను దారుణంగా చంపేశారు
సాయికుమార్ చేతిలో తన కుమార్తె లతిక చిత్రహింసలకు గురైందని, వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని, తన కుమార్తెను కొట్టి, శరీరమంతా వాతలు పెట్టి చిత్రహింసలకు గురి చేశాడనీ ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమార్తెను దారుణంగా హత్య చేసి, ప్రస్తుతమున్న గర్భాన్ని పోగొట్టి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమార్తె మరణానికి కారణమైన భర్త సాయికుమార్, వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళ, లింగన్న, పద్మ అలియాస్ శాంతిలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రిమ్స్ పీఎస్ సీఐ కె. రామచంద్ర తెలియజేశారు.

వరద కోడ్ ఉల్లంఘన


టీడీపీ జెండాతో ఉన్న వరదరాజులరెడ్డి కారు

ప్రొద్దుటూరు : టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి గురువారం ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం పరిధిలో వంద మీటర్ల వెలుపలే వాహనాలు నిలపాలని అధికారులు ఆదేశించారు. అధికారుల ఆదేశాలను పట్టించుకోకుండా వరదరాజులరెడ్డి తన నామినేషన్ సందర్భంగా నేరుగా తహసీల్దార్ కార్యాలయం మెయిన్ గేటు వద్దకే టీడీపీ జెండా కట్టిన కారులో వచ్చారు. ఇంత వరకు నామినేషన్ వేసిన అభ్యర్థులు ఎవ్వరు ఈ విధంగా కోడ్ ఉల్లంఘించలేదని, వరద మాత్రమే ఇలా చేశారని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. దీనిపై అధికారులు ఏమి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

తెలంగాణ ఫస్ట్‌ఇంటర్ ఫలితాల్లో మెరిసిన కడప బాలిక


సుహాన

కడప ఎడ్యుకేషన్ : కడప హౌసింగ్ బోర్డుకాలనీకి చెందిన పేట మహమ్మద్ ఖలీలుల్లా, పేట అఫ్రీన్‌ల కుమార్తె పేట సుహాన తెలంగాణ ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో మెరిసింది. హైదరాబాద్ మాదాపూర్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ చదువుతున్న సుహాన 470 మార్కులకు 467 మార్కులు సాధించి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 2వ ర్యాంకును సాధించింది.

ఇండియా కూటమి అభ్యర్థులను బలపరచాలి


మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను బలపరిచి అధిక మెజారీతో గెలిపించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్ పిలుపునిచ్చారు. గురువారం కడపలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మతోన్మాద బీజేపీ అన్ని విధాలుగా దేశ ప్రజానీకాన్ని మోసం చేసిందని తెలిపారు. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో పరిశ్రమలను తెగనమ్ముతున్నారని, అందులో భాగంగానే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేస్తున్నారని తెలిపారు. కడప జిల్లాకు విభజన హామీల్లో ఇచ్చిన ఉక్కు ఫ్యాక్టరీని శిలాఫలకానికే పరిమితమైందన్నారు. రాష్ట్రంలో దేశంలో బీజేపీ మతోన్మాద పార్టీని ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగ సుబ్బారెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లాఅధ్యక్షుడు తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ముద్దనూరు : ముద్దనూరు–మంగపట్నం రైల్వే స్టేషన్ మధ్య గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు.ఎర్రగుంట్ల రైల్వే పోలీసుల సమాచారం మేరకు సుమారు 30 సంవత్సరాల వయసు గల వ్యక్తి మృతదేహం గురువారం రైల్వే ట్రాక్‌పై పడి ఉంది.మృతుడు కాషాయ రంగు హాఫ్ షర్టు వేసుకున్నాడని,లుంగీ ధరించి ఉన్నాడన్నారు. చనిపోయిన వ్యక్తి ఆనవాళ్లు ఏమీ లభించలేదన్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లి మండలం సీటీఎం పంచాయతీ చిలకవారిపల్లి కు చెందిన శ్రీనివాసులు కుమారుడు లక్ష్మీకాంత్(27), కుటుంబ సమస్యల కారణంగా బుధవారం రాత్రి పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చిత్తూరు జిల్లా గంగవరానికి చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు సురేష్ (27) జులాయిగా తిరుగుతుండడంతో గురువారం తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన సురేష్ పురుగుమందు తాగాడు.